# ప్రహోత్రిపిసయం

కొడవాలి సాంబశివరావు

శ్రీధరంతో నా స్నేహం వయస్సు ఇరవై ఏండ్లు. మా చెలిమి చిన్ననాటిది, చిరకాలంది. బుల్లెయ్యగారి దొడ్లో దొంగ ఉసిరికాయలు తెంపుకుని రామమందిరం వెనక మర్రిచెట్టు నీడలో పంచుకుని తిన్నప్పటిది! అప్పుడప్పుడూ బడికి ఎగనామంపెట్టి బ్రహ్మగుండం చెరువులో ఈదులాడి, బడివదిలే టయానికి ఏమీ ఎరుగని నంగనాచుల్లా ఇళ్ళకు చేరేవాళ్ళం. తాటి ముంజలుగానీ, ఈత కాయలుగానీ — ఏవైనాసరే సమంగా పంచుకు తినేవాళ్ళం. ఒక కంచంలో తినకపోయినా, ఒకే మంచంలో పడుకునే వాళ్ళం — ఒకే ఊళ్లో — ఒకే బళ్ళో. ఒకే బెంచీలో స్కూలు ఫైనల్ వరకూ కలిసే చదివాం. ఆ తరువాత కాలేజీ చదువుకై చెరో ఊరు వెళ్ళిపోవడం జరిగింది మనుషులం దూరమైనా మా మధ్య స్నేహం చివురిస్తూనేవుంది ఉత్తరాల ద్వారా.

చదువైపోయాక శ్రీధరానికి తెనాలి బ్యాంకులో ఉద్యోగమయింది. నేనూ బ్రతుకు తెరువు వెదుక్కుంటూ వైజాగ్ వెళ్ళిపోయాను. అక్కడే స్థిరపడిపోవడం జరిగింది. దానాదీనా శ్రీధరాన్ని చూసి రెండేళ్ళయింది. రెండు రోజులక్రితం శ్రీధరం నుంచి వచ్చిన ఉత్తరం నన్ను అమితంగా ఆశ్చర్యంలో ముంచేసింది. విషయం చదివి నమ్మలేక పోయాను. అందుకు కారణం లేకపోలేదు.

స్వతహాగా ముందునుంచీ శ్రీధరం కొంచం పిరికి. ప్రతివిషయంలోనూ జంకుతుంటాడు. అలాంటి పిరికి మన సత్వంగల శ్రీధరం ఇంతటి సాహసం చేశాడంటే నా కెందుకో నమ్మకం చిక్కడంలేదు. నాగేష్ చెప్పాక నమ్మక తప్పలేదు.

ఏమైనా ఈ విషయంలో వాడ్ని మన స్ఫూర్తిగా అభినందిస్తున్నాను ఎందుకంటే అలాంటి పరిస్థితే నా జీవితంలోనూ ఎదురయింది. పిరికివాడిలా వెనుకంజ వేశాను నేను. దానికి ఫలితంగా సుకన్యకు దూరమయ్యాను. కాదు! నేనే దూరం చేశాను. పెద్దవాళ్ళ ఏడ్పులకు -

మిథ్యా గౌరవాలకు తలొగ్గి, మనసారా ప్రేమించిన సుకన్యకు అన్యాయం చేశాను పరువు ప్రతిష్ఠలకోసం ప్రాకులాడి జీవితాన్ని బలిచేసుకున్నాను. నాకు కస్తూరితో నా వివాహమైంది కస్తూరి ఎంతటి అసూయపరురాలో అంతటి అనుమానస్తురాలు. ఆమెతో నా జీవితం దినదిన గండంగా తయారయింది. లేనిపోనివి కల్పించుకుని ఇంటిని నరకంచేస్తూ శాంతినీ, విశ్రాంతినీ లేకుండా చేస్తుంది. సుకన్యకు అన్యాయం చేసినందుకు నా కిలాంటి శాస్తి జరగవలసిందే!

నేను చేయలేని సాహసం శ్రీధరం చేశాడు. ముందడుగువేసి కోరుకున్న వనితను దక్కించుకున్నాడు. తల్లిదండ్రుల్ని ఎదిరించి వేరే కులం అమ్మాయిని పెళ్ళిచేసుకుని కాపురంకూడా పెట్టేశాడు. నాగేష్ద్వారా ఈ వార్త విన్నపుడు నిజంగా సంతోషమయింది. శ్రీధరం చేసిన పని సమంజసమే ననిపించింది. పెద్దవాళ్ళకోసం – బూజుపట్టిన సాంప్రదాయాలకోసం మనసు చంపుకుని, జీవచ్ఛవంలా పడివుండేకన్నా, నచ్చిన ఆనందాన్ని వెదుక్కొని సుఖించడమే ఉత్తమం! లోకంకోసం – నీతులకోసం, రివాజులకోసం భయపడితే మిగిలేది నరకమే! అందుకు ఉదాహరణ నా జీవితమే!

శ్రీధరాన్ని అంతగా ఆకర్షించబడ్డ ఆమె రూపాన్ని ఊహించుకోవాలని తాపత్రయపడ్డాను. అది వృథా ప్రయత్నమేనని తెలుసు. పిచ్చి మనసు ఊరుకోదుకదా? ఎటూ రెండు రోజుల్లో ఆఫీసు పనిమీద తెనాలి వెళ్ళాల్సివుంది. శ్రీధరాన్ని కలుసుకుని అభినందనలు తెలపాలనుకున్నాను.

* * *

రైలు దిగి ప్లాట్ఫారందాటి బయటకు వచ్చాను. ఇంతకుముందు ఎన్నడూ తెనాలి వెళ్ళలేదు. ఇదే మొదటిసారవడంతో కొత్తగావుంది. నేరుగా నడుచుకుంటూ బస్టాండ్కి వెళ్ళాను. కడుపులో ప్రేవులు రొద పెడుతున్నాయ్ ఆవురుమని. హోటల్ స్వాగత్లో జొరబడి ఆత్మారాముడ్ని చల్లబరిచి బయటకొచ్చాను.

ఇప్పుడు కార్యక్రమమేమిటని కొన్ని క్షణాలు ఆలోచించాను. పది గంటలకుగానీ ఆఫీసు తెరవరు. ఇప్పుడు తొమ్మిదే అయింది. మరో గంటసేపు రోడ్లు కొలుస్తూ తిరగాల్సివాలంటే బోర్ కొడుతుంది. "పోనీ ఈలోగా శ్రీధరాన్ని కలసి వస్తే?" ఈ ఆలోచన బాగా నచ్చింది. అడ్రసు కాగితం చూసుకుని బయలు దేరాను.

ఓ పావు గంటకు మారీసు పేటలో వున్న శ్రీధరం ఇల్లు కనుక్కో గలిగేను. బయట ఇద్దరు ముగ్గుర్ని వాకబ్ చేస్తే అదేనని చెప్పారు. ఇల్లు మరీ చిన్నది కాకపోయినా, బాగానేవుంది. చుట్టూ వెదురు తడికెల కాంపౌండు, లోపల పూలమొక్కలు, వేపచెట్టు – బావుందనిపించింది తలుపు దగ్గరగావేసి వుండడంతో వీడు ఇంట్లో వున్నాడో లేదోనని సందేహిస్తూ తలుపు తట్టబోయి — లోపల్నుంచి మాటలు వినిపించడంతో ఆగిపోయాను —



"సుకన్యా! నేను చెప్పినట్లు వినక పోతే నీకీ ఇంట్లో స్థానంలేదు—"

అది శ్రీధరంగొంతు. విని ఆశ్చర్య పోయాను నేను.

"ఏమిటి మీరు చెప్పేది? కట్టుకున్న భార్యను పరాయి పురుషునితో కిరాయికి పంపడానికి మీకు సిగ్గులేదూ? అసలు మీరు మనుషులేనా?" అంది. అది.... అతని భార్య గొంతు కావచ్చు

సుకన్య అంటున్నాడు. ఎవరీమె? ఆమె కాదుగదా? గొంతు అలా లేదే? అయినా అనుమానం వదల్లేదు నన్ను.

"నోర్ముయ్! నాకు ఎదురు చెప్పావంటే పళ్ళు రాలగొడతాను—"

"నన్ను చంపినా సరే. అలాంటి నీచపు పనులు చేయను."

"మహా పతివ్రతలా మాట్లాడకు! ఇల్లు వదిలి నాతో లేచి వచ్చినపుడే పోయింది నీ పతివ్రతాతనం. సుఖిద్దరం కలిసివుండాలంటే నేను చెప్పినట్లు నీవు విని తీరాలి —"

"ఎందుకండీ నా మీదింత కక్ష? మిమ్మల్ని మనసారా నమ్మి, మీతోటిదే లోకమని, కన్నవాళ్ళను దూరంచేసికొని వచ్చాను. నాకింతటి శిక్షవద్దు. మరే దయినా చెప్పండి చేస్తాను —"

"లాభంలేదు సుకన్యా! మనిషి సుఖంగా బ్రతకాలంటే డబ్బు కావాలి. ఎంతోమంది ఆఫీసర్లు నీ అందానికి దాసోహమంటున్నారు. వారికి డబ్బుంది. సుఖం కావాలి. నీకు అందంవుంది. నాకు డబ్బుకావాలి. మన కష్టాలు తీరాలంటే తప్పదు. డబ్బుంటేనే ఈ లోకంలో మనష్యుల్ని గౌరవించేది. డబ్బు చాటున ఎన్ని అవినీతి పనులైనా మరుగున పడి పోతాయి. మనం నీతి, నిజాయితీగావుండి కడుపు కాల్చుకున్నా ఎవరికీ పట్టదు. అదే డబ్బుంటే, అదే జనం మనకు వంగి వంగి సలామ్‌లు చేస్తారు —"

"అలాంటి పాపపు సొమ్ము మన కొద్దండీ! వున్నదానితోనే కలోగంజో త్రాగుదాం —"

"నీ కవసరం లేకపోయినా, నాకు కావాలి డబ్బు. మర్యాదగా నేను చెప్పినట్టు విను. ఇద్దరం సుఖపడతాం —"

"ఛీ....ఎంత చెప్పిన మీ మాట మీదే! భార్య శీలాన్ని పణంగా పెట్టి డబ్బు సంపాదిద్దామనే మగాదెవడన్నా వున్నాడా? నా కంఠంలో ప్రాణముండగా అలాంటి అవినీతి పనులెన్నడూ చేయను—"

"సుకన్యా! బాగా ఆలోచించుకో. నా మాట కాదన్ననాడు నీ బ్రతుకేమిటో తెలుసుకో. కుక్క చింపిన విస్తరవుతుంది. పతితగా ముద్ర పడుతుంది. ఈ సంఘం నిన్ను కాకుల్లా పొడిచి పొడిచి తరిమి తరిమి చంపుతుంది. అప్పుడు నీ అందమయిన శరీరం ఏమవుతుంది?"


వింటున్న నా తల తిరిగిపోతోంది.

శ్రీధరం ఇంతకు దిగజారిపోయాడా? మూర్ఖుడు. కట్టుకున్న భార్య పట్ల ఎంత హీనంగా ప్రవర్తిస్తున్నాడు?

ప్రేమించానని ఆ అమాయకురాల్ని వంచించాడు. వీడ్ని నిలువునా షూట్ చేసినా పాపం లేదు. వాడి మాటలు వింటూంటే, నాకు అంతవరకూ వాడిపైన ఏర్పరచుకున్న అభిప్రాయం చెదిరిపోయింది. అసహ్యమూ, రోత కలిగిస్తున్నాయి. కారు కూతలు కూస్తున్న వాడినాలుక చీల్చేసి, నిలువునా పాతేద్దామన్న ఆవేశం కల్గింది. అయినా తమాయించుకున్నాను.

"ఏమంటావు సుకన్యా? నా మాట విను. బాగుపడిపోతాం. పాపంలేదు పుణ్యం లేదు. డబ్బుంటే అన్నీ కొనుక్కోవచ్చు."

"నీలాంటి వంచకుణ్ణి నమ్మి మోసపోయినందుకు చింతిస్తున్నాను. నువ్వు పశువ్వి—నీతిలేని వాడివి. నీతో వుండే కన్నా ఎందులోనన్నా దూకి చావడం మేలు"




"నన్ను అంత తేలిగ్గా చావనిస్తానను కున్నావా? పెడరెక్కలు విరిచి లాక్కొస్తాను. మంచిగా చెబితే నువ్వు వినవు. తగిన శాస్తి జరిగితేగాని దారికి రావు."

ఏం చేయనున్నాడో దుర్మార్గుడు-

నా రక్తం ఉడికిపోతోంది

"ఏమిటీ దౌర్జన్యం! నీతో వుండడం నా కిష్టం లేదు. నన్ను పోనీ."

"ఎక్కడకు పోతావే?"

జుట్టు పట్టుకుని వంగవేసి గుద్దినట్లు చప్పుడు-ఆమె ఏడుపులు!

కాలితో కడుపులో తన్నాడేమో కెవ్వుమంది.

నాలో ఆవేశం కట్టలు తెంచుకుంది. ఎదురుగా ఓ అభాగ్యురాలికి జరుగుతున్న అన్యాయాన్ని సహించలేక పోతున్నాను. హృదయం మండిపోతోంది. తలుపు తన్నుకుని లోనికి వెళ్లాలనుకున్నాను. ఇంతలో మాటలు వినిపించగానే ఆగిపోయాను.

"సాయంత్రం దాకా టైమిస్తున్నా. ఆలోచించుకో. లేకుంటే నా సంగతి తెలుసుగా! జుట్టు పట్టుకుని ఈడ్చుకొస్తాను ఎక్కడికి కెళ్ళినా. జాగ్రత్త!" బయటకు వస్తున్నట్లు అడుగుల శబ్దం దగ్గర కాగానే చటుక్కున ప్రక్కకు తప్పుకున్నాను.

శ్రీధరం తలుపు తెరుచుకుని విసురుగా ఎక్కడికో వెళ్ళిపోయాడు.

ఇక వాడిని కలవాలనిపించలేదు.

ఆఫీసుకు వెళ్ళిపోయాను తిరిగి.

సాయంత్రం పని ముగించుకుని బయట కొస్తుంటే ఆఫీసు కాంపౌండులో ఎదురయ్యేడు శ్రీధరం. వాడిని చూస్తూనే ఉదయం.... జరిగిన సంఘటన కళ్ళ ముందు మెదిలింది.

"ఒరేయ్ భానూ! ఎప్పుడొచ్చా

వురా?" సంబ"ంగా కౌగిలించుకున్నాడు.

నాకు చిరాకేసింది. తేళ్ళు, జెర్రులు ప్రాకినట్టు ఛీదరంగా వుంది. విడిపించు కుని ప్రక్కకు తొలిగి "ఉదయం వచ్చేను-" అని అన్నాను ముక్తసరిగా. ఎందుకో వాడితో మాట్లాడ బుద్ధి కావడం లేదు.

"ఎంత దుర్మార్గుడివిరా నీవు? ఉదయ మనగా వచ్చి ఇంటి వేపన్నా వచ్చావా? అసలు నీకో ప్రాణమిత్రుడు న్నాడని గుర్తుందా?" నిష్ఠూరంగా అన్నాడు.

"ఎందుకు గుర్తులేదు? బాగా గుర్తుం టావు నువ్వేదో ఆదర్శవంతంగా జీవి స్తున్నావని అపోహపడ్డాను. ఇంత నీచా నికి దిగజారిన నిన్ను ఎలా మర్చిపో తాను" కసిగా అనుకున్నాను.

"సరే ఇంటికి వెళదాం పద. చాలా రోజులకు మనం కలుసుకున్నాం-" నవ్వుతూ రెక్కపట్టుకు లాగాడు. వాడి నవ్వు చూస్తుంటే నాకు తగని అస హ్యమేస్తోంది. దుర్మార్గుడు! ఎంత తియ్యగా నవ్వుతున్నాడు?"

"నాకు పనుంది" అన్నా వినిపించు కోలేదు.

బలవంతాన లాక్కు పోయేడు వాళ్ళ ఇంటికి.

దారిలో తమ కొత్త కాపురాన్ని గురించి ఎన్నో తీయని కబుర్లు చెప్పాడు "మేమెంతో ఆనందంగా, ఒకరినొకరం అర్థం చేసుకొని బ్రతుకు తున్నామని" ఏవేవో చెప్పాడు

వాడి మాటలు నేనెలా నమ్మగలను? నాకర్థం కానిదల్లా ఒక్కటే! బి.కామ్ పాసై బ్యాంకులో అయిదారొందలు సంపాదిస్తున్నాడు. భార్య శీలాన్ని ఎరగా పెట్టి డబ్బు సంపాదించాలని ఎందుకంత నీచానికి పాల్పడుతున్నాడు? ఏమో ఉద్యోగం వున్నదో ఊడి పోయిందో? ఏ అవినీతి పని అయినా చేసి పట్టుబడి వుండొచ్చు కదా! దేనికీ ఆశ్చర్యపోవ లసిన పనిలేదు. శ్రీధరం ఎంతకయినా సమరుదే!

"సుకన్యా! వీడు నా బెస్ట్ ఫ్రెండ్ భానుమూర్తి. అప్పుడప్పుడూ చెబుతుం టానే వీడిని గురించే-" నవ్వుతూ అన్నాడు.

ఆమె తలాడిస్తూ "కూర్చోండి అన్నయ్యా! కాఫీ తెస్తాను" అన్నది.

ఆమె మాటల్లో ఎక్కడా తెచ్చి పెట్టుకున్న "నటన" కనిపించలేదు. ఎంతో ఆత్మీయంగా వున్నాయి. ఆమె మాటలు. "ఇంత మంచి మనిషినా వీడు బాధించి. బలి పశువును చేయబోతోంది?" నా మనసు మూలిగింది బాధగా.

ఏమీ జరగనట్లే - ఎంతో అన్యో న్యంగా ప్రవర్తిస్తున్న వారి చర్యలకు విస్తుబోయాను. శ్రీధరం నవ్వుతూ వేవో జోక్స్ వేస్తూ త్రుళ్ళుతున్నాడు.

అందుకామె కూడా నవ్వుతోంది.

ఇద్దరూ నవ్వుతున్నారు.

ఆమె నవ్వులో ఏదో "అసహజం" ధ్వనిస్తోంది.

శ్రీధరం మాత్రం చాలా నాచురల్‌గా నవ్వుతున్నాడు

కారణం వాడు "నటన" బాగా నేర్చు కున్నాడు.

అప్పుడనిపించింది నాకు ఈ సం ఘంలో ఎందరు శ్రీధరాలున్నారు? ఎం దరు అభాగినులున్నారు! అని.